



**MILE STONES**

| | | | |
|---|---|---|---|
| 1977 | Sri Prakash Vidya Niketan (EM), Tuni | Sri Prkash Vidya Niketan (E.M) Visakhapatnam | 2001 |
| 1982 | S.V. College of Education, Payakaraopeta | Sri Prakash Vidya Niketan (EM), Payakaraopeta | 2002 |
| 1988 | Sri Prakash Junior College, Payakaraopeta | S.V. College of Ele. Teacher Educ. Payakaraopeta | 2005 |
| 1993 | SPACES Degree College, Payakaraopeta | Sri Synergy School, Peddapuram | 2007 |
| 1993 | Sri Prakash Residential Model High School (TM), Payakaraopeta | Sri Prakash Young Achievers, Visakhapatnam | 2007 |
| 1999 | SPACES Institute for P.G. Studies (MCA), Payakaraopeta | Krishna's Pragati Institute of Technology, Rajhmundry | 2008 |
| 2001 | Sri Prakash College of Engineering, Tuni | | |


శ్రీప్రకాష్ విద్యా సంస్థలు


RED CONVENT STREET, TUNI - 533 401, PH: 254511, 254522 (08854) | NH-5 ROAD, PAYAKARAOPETA - 531 126, PH: 254523, 254544 (08854) | UPLANDS, ASILMETTA, VISAKHAPATNAM, PH: 6662299, 2719336 | IMSA CAMPUS, PEDDAPURAM - 533 437, PH: 08852 241191, 9247730333

visit us at: sriprakash.org e-mail: info@sriprakash.org


# పశు పోషణ

## - ఒక లాభదాయక పరిశ్రమ

MILKING MACHINES




పాలు - పేడ - మూత్రం - పెయ్యలు


విరచితము..

శ్రీ సి. హెచ్.వి.కె.నరసింహారావు B.E.
శ్రీ ప్రకాష్ విద్యా సౌధం, ఎన్.హెచ్ - 5 రోడ్, పాయకరావు పేట, విశాఖ జిల్లా
Phone: 254577 (R), 254533, 254544 (O)

# పాడి పరిశ్రమ

నేడు పశుపోషణ పాతకాలం నాటి పెరటి వృత్తి కాదు. ప్రస్తుతం ఇది ఒక వ్యవసాయ ఆధారిత పరిశ్రమగా రూపుదిద్దుకొన్నది. పశుపోషణ భారత దేశపు వ్యవసాయ ఆధారిత ఆర్థిక వ్యవస్థలో ప్రముఖ పాత్ర వహిస్తున్నది. చక్కటి ప్రణాళికతో ప్రోత్సహించినచో పశుపోషణ భారతీయ ఆర్థిక రంగంలో, పారిశ్రామిక రంగాన్ని మించిన వ్యాపారంగా అభివృద్ధి చెందుతుంది. పశుపోషణకు సంబంధించిన వ్యాపారం సంవత్సరం పొడవునా చురుగ్గా సాగుతుంది.

పప్పుదినుసులు, కూరగాయలు తగినంతగా లభ్యం కాకపోవటంతో పాల ఉత్పాదిత వస్తువులను ఎక్కువగా ఉపయోగించుచున్నారు.

పశుపోషణ ద్వారా పాలను పొందటమే గాక వంట గ్యాస్ (బయోగ్యాస్), విద్యుత్ (కరెంట్), క్రిమిసంహారక మందులు (పంచామృతం, పంచగవ్యం), సేంద్రియ ఎరువులు (వర్మీకంపోస్టు వగైరాలు) పొందగలము. పాలు, ఇతర ఉప ఉత్పత్తుల ద్వారా ఆదాయాన్ని గణనీయంగా పెంచుకొని ఊహించని లాభాలను పొందవచ్చును.

ఈ విషయాలన్నీ పశుపోషణ లాభదాయకమైన స్వయం పోషక వృత్తి అని తెలుపుచున్నవి.

పాడి పరిశ్రమ ద్వారా లాభాలు పొందాలి అంటే దిగువ తెలిపిన విషయాల గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకొనవలసి వుంది.

| | | |
|---|---|---|
| 1. పశువుల ఎంపిక | 2. ఆహారం | 3. నీరు 4. వసతి |
| 5. యాజమాన్యం | 6. ఆరోగ్యం | 7. పారిశుధ్యం |
| 8. అనువైన ప్రదేశం | 9. మార్కెట్ | 10. పెట్టుబడి |



# 1. పశువుల ఎంపిక

పాడి పరిశ్రమ లాభాలతో నడవాలి అంటే పశువుల ఉత్పత్తి సామర్థ్యాన్ని అంచనా వేసుకొనటం అవసరం.

ఆవులలో రోజుకు సగటు దిగుబడి 10-12 లీటర్లు, ఈత కాలంలో (300 రోజులలో) దిగుబడి 3500-4500 లీటర్లు ఇవ్వగలిగిన ఆవులను మాత్రమే కొనాలి.

గేదెలలో సగటు దిగుబడి 6-8 లీటర్లు, ఈత కాలంలో(300 రోజులలో) దిగుబడి 2000-2500 లీటర్లు ఇవ్వగలిగిన గేదెలను మాత్రమే కొనాలి.

పశువు అందరిని పాలు పితకనిస్తుందా లేదా చూసుకోవాలి. అన్ని రకాల మేతలకు అలవాటు పడగలదా లేదా, మన వాతావరణానికి సరిపడుతుందా లేదా గమనించి పశువులను ఎంపిక చేసుకొనడం మంచిది.

పాడి పశువులు నిండుగా, చురుకుగా, ఆడ లక్షణాలు కలిగి ఉండాలి. బాగా బలిసి ఎద్దులాగా వుండకూడదు. శరీరము మంచి అంగ సౌష్టవం కలిగి ఎటుచూసినా త్రికోణాకారము కల్గివుండాలి. చర్మము పలుచగాను, మృదువుగాను, నిగనిగ మెరుస్తూ ఉండాలి. లాగితే ముడత సులువుగా రావాలి. వదిలితే యథాస్థానంలో వుండాలి. తేలికగా, చురుకుగా, సులువుగా కూర్చోవాలి, లేవాలి. కళ్ళు చురుకుగా విశాలంగా వుండాలి. ముట్టె విశాలంగానూ, పెద్ద నాశికారంధ్రాలు కలిగి వుండాలి. మెడపొట్టిగానూ సన్నగాను వుండాలి. ఛాతి భాగము విశాలముగా వుండాలి.

పొదుగు బాగం విస్తరించి శరీరానికి బాగా అత్తుకొని ఉండాలి. వదులుగా వ్రేలాడేటట్లు ఉండకూడదు. పొదుగు మెత్తగా దూదివలె ఉండాలి. ఎలాంటి కణుతులు లేకుండా వుండాలి. పాలు తీయగానే పొదుగు ముడుచుకుపోవాలి. అలా ముడుచుకుపోని పొదుగు కండ పొదుగు. కండ పొదుగు గాంభీర్యానికి మాత్రమే కాని, పాల ఉత్పత్తికి పనికి రాదు. పొదుగు ఇరువైపులా వుండే పాల నాళాలు పెద్దగా ఉబ్బి, మెలికలు తిరిగి, పైకి స్పష్టంగా కనిపించాలి. చనులు నాలుగూ మృదువుగాను, మెత్తగాను ఉండి, నొక్కిచూస్తే బాగా దారపడేటట్లు ఉండాలి. పొదుగు మీద చదరంగా నాలుగు కోణాలలో సమానంగా అమరి ఉండాలి. తుంటి చంక వెడల్పుగా ఉండాలి.

నెలలోపు ఈనిన పశువులనే కొనాలి. లేక 7వ నెల చూడి పశువులను కొనాలి. మొదటి ఈత, రెండవ ఈతలో వున్న పశువును మాత్రమే కొనాలి. మొదటి 6 ఈతలలోనే పశువు గరిష్ట స్థాయిలో

పాల దిగుబడి ఇవ్వగలదు. పశువుల పలువరుసలు బట్టి కొంత వరకూ వయస్సునూ, ఈతల సంఖ్యనూ నిర్ణయించవచ్చును.

50 పశువులతో ప్రారంభించుదామన్న పాడి పరిశ్రమలో, గేదెలను, ఆవులను 60 : 40 నిష్పత్తిలో కొనుగోలు చేయుటం మంచిది. అనగా సుమారు 24 పాడి గేదెలు, 16 పాడి ఆవులు, 6 చూడి గేదెలు, 4 చూడి ఆవులతో ఒక ఆబోతు, ఒక దున్నపోతు తో పాడి పరిశ్రమ ప్రారంభించి, కాలక్రమేణా 20-25 పడ్డలను కూడా మేపటం మంచిది.

## 2. ఆహారం

పాల ఉత్పత్తి బాగుండాలి అంటే జాతి- మేత ముఖ్యం. పాల ఉత్పత్తి మేపు మీద 60%, జాతి మీద 40% ఆధారపడి వుంటుంది.

అధిక పాల దిగుబడి పొందాలి అంటే పాడి పశువులకు మంచి పోషక విలువలున్న ఆహారం పెట్టాలి. పాల ఉత్పత్తికి అయ్యే ఖర్చును మనం ఈ క్రింది విధంగా విభజించవచ్చును.

1. మేత కొరకు 55%  2. మానవ వనరులు 22%  3. పెట్టుబడి తరుగుదల వడ్డీ 16%
4. వైద్యం 5%  5. పారిశుధ్యం -1%  6. సాదర ఖర్చులు 1%

పైన తెలిపిన ఖర్చులలో మానవ వనరులు, పారిశుధ్యం, తరుగుదల, వడ్డీ మొదలగునవి స్థిర ఖర్చులు. మేతకు అయ్యే ఖర్చు మాత్రం పాల దిగుబడి పై ఆధారపడి ఉంటుంది. కనుక మనం సమతుల్య ఆహారాన్ని పశువులకు మేపి, పాల దిగుబడిని పెంచుకోగలిగినచో, మనం లీటరు పాల దిగుబడి పై వచ్చే లాభాన్ని పెంచుకొనవచ్చును.

తక్కువ పాల దిగుబడిని ఇచ్చే పశువు మన నిచ్చే ఆహారంలో 66.7% శరీర పోషణకు ఉపయోగించుకుంటుంది. అదే ఎక్కువ పాల దిగుబడిని ఇచ్చే పశువు కేవలం 35.8% ఆహారాన్ని మాత్రమే శరీర పోషణకు ఉపయోగించుకొంటుంది.

అధిక పాల దిగుబడిని ఇచ్చే పశువులు ఎక్కువ ఆహారాన్ని తీసుకుంటాయి. ఈ ఎక్కువగా తీసుకొనే ఆహారానికి అయ్యే ఖర్చుతో పోల్చినప్పుడు, అధికంగా ఇచ్చే పాల పై వచ్చే ఆదాయమే అధికంగా ఉంటుంది. కనుక ప్రతీ రైతు, పశువు పాల దిగుబడిని బట్టి సమతుల్య ఆహారాన్ని పశువులకు అందించి పాల ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించి ఎక్కువ లాభాలను పొందవచ్చును. పశుపోషణలో మనం ముఖ్యంగా మేపు దానికి అయ్యే ఖర్చులను జాగ్రత్తగా పరిశీలించి, తగిన జాగ్రత్తలు తీసుకొని మేపుకు అయ్యే ఖర్చులను తగ్గించి పాల ఉత్పత్తిని పెంచుకోగల్గినప్పుడు, మనం ఎక్కువ లాభాలను పొందవచ్చును.

మన రైతులు పూర్వకాలం నుండీ పశువులకు గ్రాసాలు (పచ్చగడ్డి, ఎండుగడ్డి, జొన్న చొప్ప వగైరాలు) దానాలు (వరి తవుడు, చిట్టు, గోధుమ తవుడూ, ఉలవలూ వగైరా) మేపుచున్నారు. వీటికి అయ్యే ఖర్చుతోనే పోషకవిలువలున్న సమతుల్య ఆహారం అందిస్తే పశువు బాగా పాలిస్తుంది.

తిన్న మేతలో పశువులు జీర్ణించుకొని, శరీరానికి ఉపయోగించు కొన్న మాంసకృత్తులు, పోషక పదార్థాలనే పరిగణనలోనికి తీసుకోవాలి. వాటినే 1. జీర్ణయోగ్యమైన మాంసకృత్తులు (డి.సి.పి) 2 జీర్ణయోగ్యమైన మొత్తం పోషక పదార్థాలు (టి.డి.యన్.) అంటారు. మనం పశువుల కిచ్చే ఆహారం తినడానికి రుచిగా ఉండి, తక్కువ ధరకు తయారు చేసుకోగలగాలి.

సాధారణ పాల దిగుబడినిచ్చే పశువులకు 70% ఘన పదార్థాన్ని పశుగ్రాసం ద్వారాను 25% దాణా - ద్వారాను సమకూర్చటం లాభదాయకం. అధిక దిగుబడిని ఇచ్చే సంకర జాతి పశువులకు ఘన పదార్థాలను 75% దాణా ద్వారాను, 25% గ్రాసాల ద్వారాను సమకూర్చటం మంచిది.

పశువులకు ఆహారం 4-5 సార్లు ఇవ్వటం మంచిది. పశువుకు నెమరువేయడానికి తగినంత సమయం కేటాయించాలి. గడ్డి కత్తిరించి మేపటం ద్వారా, గడ్డిని ఆదా చేసుకొని పాల ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకొనవచ్చును.

**గ్రాసాలు** - ఎండుగడ్డి, ఎండు చొప్ప, పచ్చగడ్డిలను పశుగ్రాసాలుగా వాడతారు. ఎండుగడ్డి (వరి గడ్డి, గోధుమ గడ్డి వగైరా), ఎండుచొప్ప (జొన్నచొప్ప, మొక్కజొన్న చొప్ప వగైరా)లను సాయంత్రం మేపటం మంచిది. ఎండు గడ్డి తినేటప్పుడు అధిక వేడి ఉత్పత్తి అవుతుంది. ఎండుగ్రాసం మేపుట వలన జీర్ణకోశంలో ఎసిటిక్ ఆమ్లం తయారయి పాలలో వెన్నశాతం పెరుగుతుంది.

**పచ్చగడ్డిని కాయజాతి** - (అవిశ, సుబాబుల్, హెడ్జిలూసర్న్, జనుము, పిల్లిపెసర, గోరుచిక్కుడు) ధాన్యపుజాతి (కో1, కో3, నేపియర్, గినీగడ్డి, మొక్కజొన్న, జొన్న) రూపంలో పండించి సమపాళ్ళలో మేపుట వలన పాల ఉత్పత్తి ధర తగ్గుతుంది. పచ్చగడ్డిని ఉదయం పూట మేపటం మంచిది. పచ్చగడ్డి మేపుట వలన జీర్ణకోశంలో ప్రొపియోనిక్ ఆమ్లం ఎక్కువగా తయారయి, పాల దిగుబడి పెరుగుతుంది. వెన్నశాతం తగ్గుతుంది. సుమారు 8-10 కేజిల ఎండుగడ్డి లేక 20-25 కేజిల పచ్చగడ్డి మేపటం మంచిది.

**దాణాలు-** పశువుల దాణాలో సాధారణంగా, మొక్క జొన్నలు, జొన్నలు, సజ్జలు, రాగులు, ఉలవలు, సెనగలు, కర్రపెండలం, వేరుశెనగ చెక్క, నువ్వుల చెక్క, ప్రత్తి గింజల చెక్క, కొబ్బరి చెక్క, వరి తవుడు, గోధుమ తవుడు, నూనె తీసిన వరి తవుడు, చెరుకు మడ్డి (మొలాసిస్), ఖనిజ లవణాలు, విటమిన్‌లు, ఉప్పు మొదలగునవి ఉంటాయి. దాణా దినుసులలో ఉన్న పోషక విలువలను అంటే డి.సి.పి, టి.డి.యన్.లను తెలుసుకొని మిశ్రమ దాణా తయారు చేసుకొనవచ్చును. ఈ మిశ్రమ దాణాలో డి.సి.పి 13% నుండి 20%, టి.డి.యన్. 65% నుండి 75% ఉండే విధంగా మిశ్రమ దాణాను తయారు చెయ్యాలి. దీనికి 2-3% మినరల్ మిక్చర్ (ఖనిజ లవణ మిశ్రమము), ఉప్పు 2-3% కలిపి పశువులకు మేపాలి. మిశ్రమ దాణాను నాన బెట్టి మేపటం మంచిది. ఒకే దాణా దినుసు ఎక్కువగా వాడటం మంచిది కాదు. మొలాసిస్‌గాని, యూరియాగాని కలిపిన దాణాను నానబెట్టి మేపకూడదు. ఏ దాణా దినుసు ఎంత వాడవచ్చునో క్రింది పట్టిక ద్వారా తెలుసుకొనవచ్చును.

| | | | |
|---|---|---|---|
| 1. | నలగ గొట్టిన మొక్క జొన్నలు | - | 50 % |
| 2. | నలగ గొట్టిన జొన్నలు | - | 40% |
| 3. | నలగ గొట్టిన సజ్జలు | - | 30% |
| 4. | వరి తవుడు | - | 70% |
| 5. | పాలిష్ బియ్యం తవుడు | - | 40% |
| 6. | వేరు శెనగ చెక్క | - | 30% |
| 7. | నూనెతీసిన వేరుశెనగ చెక్క | - | 45% |
| 8. | ప్రత్తి గింజల చెక్క(డి.ఒ.సి.సి) | - | 35% |
| 9. | కొబ్బరి చెక్క | - | 30% |
| 10. | నువ్వుల చెక్క | - | 20% |
| 11. | ప్రత్తి గింజల చెక్క (యు.డి.సి.సి) | - | 15% |
| 12. | సోయా చెక్క | - | 40% |
| 13. | ప్రొద్దు తిరుగుడు పువ్వు చెక్క | - | 15% |
| 14. | అపరాల చున్ని పొట్టు | - | 30% |
| 15. | బెల్లపు మడ్డి | - | 10% నుండి 20% |
| 16. | ఖనిజ లవణ మిశ్రమం | - | 1 నుండి 3% |
| 17. | ఉప్పు | - | 2 నుండి 3% |
| 18. | యూరియా | - | 1 నుండి 2% |



దానా దినుసులలో పోషక విలువలు -

| దానా దినుసు పేరు | జీర్ణమగు మాంసకృత్తులు (డి.సి.పి) | జీర్ణమగు మొత్తం పోషకాలు (టి.డి.యన్.) |
|---|---|---|
| మొక్క జొన్నలు | 7.4% | 84% |
| పచ్చ జొన్నలు | 7% | 73% |
| నూనె తీసిన తవుడు | 11% | 70% |
| చోళ్ళు | 5% | 70% |
| సామలు | 6% | 70% |
| కొర్రలు | 6% | 70% |
| గంట్లు/సజ్జలు | 5% | 70% |
| కందిపొట్టు | 15% | 70% |
| మినప పొట్టు | 14% | 70% |
| పెసర పొట్టు | 10% | 65% |
| గోధుమ తవుడు | 10% | 72% |
| పచ్చగడ్డి (25% ఘ.వ) | 4% | 50% |
| ఎండు గడ్డి | 0% | 45% |
| ఎండు గడ్డి (యూరియా తో మాగ బెట్టినది) | 5% | 60% |
| మొక్క జొన్న పొట్టు | 6.5% | 50.5% |
| కర్ర పెండలం తొక్క | 6.5% | 70% |
| బియ్యం నూక | 7% | 70% |
| వరి తవుడు | 8% | 70% |
| శనగ పొట్టు | 15% | 70% |
| మొలాసిస్ | 1.7% | 85% |
| వెదురు ఆకు | 6% | 70% |
| ఉలవలు | 19% | 91% |
| ధాన్యం | 6.25% | 66% |
| బొబ్బర కాడ | 12% | 65% |
| జనుము | 12% | 65% |
| పిల్లి పెసర | 12% | 65% |
| అవిశ ఆకు | 25% | 65% |
| సుబాబుల్ ఆకు | 20% | 60% |
| ప్రత్తి పిండి (యు.డి) | 18% | 72% |
| నూనె తీసిన ప్రత్తి పిండి | 40% | 75% |
| కొబ్బరి పిండి | 22.8% | 83% |
| వేరు సెనగ పిండి | 42% | 74% |
| నువ్వుల పిండి | 38% | 78% |

# దానాలు తయారు చేసుకొనుటకు కొన్ని ఫార్ములాలు

| | 1 | | | | 2 | | | | 3 | | | | 4 | | | | 5 | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| దానా దినుసు పేరు | % | D.C.P | T.D.N | Cost Rs. | % | D.C.P | T.D.N | Cost Rs. | % | D.C.P | T.D.N | Cost Rs. | % | D.C.P | T.D.N | Cost Rs. | % | D.C.P | T.D.N | Cost Rs. | DCP/ TDN |
| నూనె తీసిన పత్తి పిండి రూ.12.00 | 15% | 6 | 11.25 | 1.8 | 15% | 6 | 11.25 | 1.8 | 15% | 6 | 11.25 | 1.8 | 15% | 6 | 11.25 | 1.8 | 16% | 6.4 | 12 | 1.92 | 40/75 |
| కొబ్బరి పిండి రూ.8.00 | 20% | 4.4 | 16.6 | 1.6 | 10% | 2.2 | 8.3 | 0.8 | 15% | 3.3 | 12.45 | 1.2 | - | - | - | - | - | - | - | - | 22.8/83 |
| నువ్వుల పిండి రూ.9.00 | 10% | 3.8 | 7.8 | 0.9 | 15% | 5.7 | 11.7 | 1.35 | - | - | - | - | 10% | 3.8 | 7.8 | 0.9 | - | - | - | - | 38/78 |
| వేరు శనగ పిండి రూ.14.00 | - | - | - | - | - | - | - | - | - | - | - | - | 10% | 4.1 | 7.4 | 1.4 | - | - | - | - | 42/74 |
| సన్‌ఫ్లవర్ పిండి రూ.7.00 | 15% | 4.2 | 11.25 | 1.05 | - | - | - | - | 15% | 4.2 | 11.25 | 1.05 | - | - | - | - | - | - | - | - | 28/75 |
| సోయా పిండి రూ.14.50 | - | - | - | - | - | - | - | - | - | - | - | - | - | - | - | - | - | - | - | - | 42/75 |
| శనగపొట్టు రూ.6.60 | 15% | 2.1 | 10.5 | 0.99 | 20% | 2.8 | 14 | 1.32 | 20% | 2.8 | 14 | 1.32 | 20% | 2.8 | 14 | 1.32 | 30% | 4.2 | 21 | 1.98 | 15/70 |
| మొక్కజొన్న పొట్టు రూ.3.70 | - | - | - | - | 20% | 1.3 | 10 | 0.74 | 20% | 1.3 | 10 | 0.74 | 20% | 1.3 | 10 | 0.74 | - | - | - | - | 6.5/50.5 |
| మొక్కజొన్న రూ.7.5 | 20% | 1.48 | 16.8 | 1.5 | - | - | - | - | - | - | - | - | 20% | 1.48 | 16.8 | 1.5 | - | - | - | - | 7.4/84 |
| గోధుమ తవుడు రూ.8.75 | - | - | - | - | - | - | - | - | - | - | - | - | - | - | - | - | 24% | 2.4 | 17.28 | 2.1 | 10/72 |
| బియ్యం నూక రూ.8.50 | - | - | - | - | - | - | - | - | - | - | - | - | - | - | - | - | - | - | - | - | 7/70 |
| నూనె తీసిన తవుడు రూ.6.00 | - | - | - | - | - | - | - | - | - | - | - | - | - | - | - | - | 30% | 2.4 | 21 | 1.8 | 8/70 |
| ఉలవలు రూ.11.00 | - | - | - | - | 15% | 2.85 | 13.65 | 1.65 | - | - | - | - | - | - | - | - | - | - | - | - | 19/91 |
| మొత్తం | 95% | 21.98 | 71.2 | 7.84 | 95% | 20.85 | 68.9 | 7.66 | 85% | 17.6 | 58.55 | 6.11 | 95% | 19.48 | 67.25 | 7.66 | 100% | 15.4 | 71.28 | 7.8 | |

* Note : మినరల్ మిక్చర్ = 2%, ఉప్పు = 2% ప్రతి ఫార్ములాకు కలపాలి



| | 6 | | | | 7 | | | | 8 | | | | 9 | | | | 10 | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| దానా దినుసు పేరు | % | D.C.P | T.D.N | Cost Rs. | % | D.C.P | T.D.N | Cost Rs. | % | D.C.P | T.D.N | Cost Rs. | % | D.C.P | T.D.N | Cost Rs. | % | D.C.P | T.D.N | Cost Rs. | DCP/ TDN |
| నూనె తీసిన పత్తి పిండి రూ.12.00 | | | | | 15% | 2.7 | 10.8 | 1.8 | 15% | 2.7 | 10.8 | 1.8 | 15% | 2.7 | 10.8 | 1.8 | 15% | 2.7 | 10.8 | 1.8 | 40/75 |
| కొబ్బరి పిండి రూ.8.00 | 30% | 6.6 | 24.9 | 2.4 | 30% | 6.6 | 24.9 | 2.4 | 30% | 6.6 | 24.6 | 2.4 | 15% | 3.3 | 12.45 | 1.2 | 15% | 3.3 | 12.45 | 1.2 | 22.8/83 |
| నువ్వుల పిండి రూ.9.00 | 10% | 3.8 | 7.8 | 0.9 | | | | | | | | | | | | | 10% | 3.8 | 7.8 | 0.8 | 38/78 |
| వేరు శనగ పిండి రూ.14.00 | | | | | | | | | | | | | | | | | | | | | 42/74 |
| సన్‌ఫ్లవర్ పిండి రూ.7.00 | 15% | 4.2 | 11.25 | 1.05 | 15% | 4.2 | 11.25 | 1.05 | 15% | 4.2 | 11.25 | 1.05 | 15% | 4.2 | 11.25 | 1.05 | 15% | 4.2 | 11.25 | 1.05 | 28/75 |
| సోయా పిండి రూ.14.50 | | | | | | | | | | | | | | | | | | | | | 42/75 |
| శనగపొట్టు రూ.6.60 | 20% | 2.8 | 14 | 1.32 | 20% | 2.8 | 14 | 1.32 | 20% | 2.8 | 14 | 1.32 | 20% | 2.8 | 14 | 1.32 | 10% | 1.4 | 7 | 0.66 | 15/70 |
| మొక్కజొన్న పొట్టు రూ.3.70 | 20% | 1.3 | 10 | 0.74 | 15% | 0.97 | 7.5 | 0.58 | | | | | 10% | 0.65 | 5 | 0.37 | 10% | 0.65 | 5 | 0.37 | 6.5/50.5 |
| మొక్కజొన్న రూ.7.5 | | | | | | | | | 15% | 1.1 | 12.6 | 1.13 | 10% | 0.74 | 8.4 | 0.75 | 10% | 0.74 | 8.4 | 0.75 | 7.4/84 |
| గోధుమ తవుడు రూ.8.75 | | | | | | | | | | | | | | | | | | | | | 10/72 |
| బియ్యం నూక రూ.8.50 | | | | | | | | | | | | | | | | | | | | | 7/70 |
| నూనె తీసిన తవుడు రూ.6.00 | | | | | | | | | | | | | | | | | | | | | 8/70 |
| ఉలవలు రూ.11.00 | | | | | | | | | | | | | 10% | 1.9 | 9.1 | 1.1 | 10% | 1.9 | 9.1 | 1.1 | 19/91 |
| మొత్తం | 95% | 18.7 | 67.95 | 6.41 | 95% | 17.27 | 68.45 | 7.13 | 95% | 17.4 | 73.55 | 7.7 | 95% | 16.29 | 71 | 7.59 | 95% | 18.09 | 71.8 | 7.83 | |

* Note : మినరల్ మిక్చర్ = 2%, ఉప్పు = 2% ప్రతి ఫార్ములాకు కలపాలి

దానాలు నానబెట్టి మేపటం మంచిది. సాయంత్రం నానబెట్టిన దానా ఉదయం, ఉదయం నానబెట్టిన దానా సాయంకాలం మేపటం మంచిది. 65% మించి జీర్ణించుకొనగలిగిన దానాలు మేపుట వలన పాల ఉత్పత్తి ధర తగ్గుతుంది.

సగటున మన పశువులు 400 కేజీల బరువు వుంటాయి. ఈ పశువులకు శరీర పోషణకు డి.సి.పి 250 గ్రాములు, టి.డి.ఎన్ 3.00 కేజీలు అవసరం ఉంటుంది. ఎండు గ్రాసాల పై ఆధారపడితే శరీర పోషణకు 1.5 కేజీల దానా, 8-10 కేజీల ఎండుగడ్డి అవసరం అవుతుంది. మేలు జాతి పచ్చిగ్రాసాలు (ధాన్యపు జాతి, కాయ జాతి గ్రాసాలు కలిపి) 20-25 కేజీలు ఇవ్వగలిగినచో శరీర పోషణకు దాణా అవసరం లేదు. పాడి పశువులు తమ శరీర బరువులో 2.5% నుండి 3% బరువుగల ఎండు గ్రాసాలు తినగలుగుతాయి. పాల దిగుబడిని బట్టి 30-40 కేజీల పచ్చిమేత తినగలుగుతాయి.

400 కేజీల బరువుగల ఆవు 4% వెన్నతో 10 లీటర్ల పాలు ఇస్తున్నచో, సుమారు 1.5 కేజీల దాణా శరీర పోషణకు, 3 కేజీల దాణా పాల ఉత్పత్తికి సమకూర్చి, 8-10 కేజీల ఎండుగడ్డి లేక 20-25 కేజీల పచ్చగడ్డి మేపటం మంచిది.

పాడి పశువు బరువు, పెరుగుదల, పాల ఉత్పత్తి, చూడి కాలంను బట్టి పోషక పదార్థాలను మేపవలసి ఉంటుంది. ప్రతీ 100 కిలోల పశువు యొక్క బరువుకు 2.00 నుండి 2.5 కిలోల ఘన పదార్థాలు అవసరము అవుతాయి. సాధారణంగా మన ప్రాంతంలో పెంచే ఆవులు సగటున 400 కిలోలు, గేదెలు 450 కిలోలు బరువు తూగుతాయి. ప్రతి పశువుకు శరీర పోషణకు 1.00 కేజీ దానా అవసరము ఉంటుంది. దానికి తోడు పాల ఉత్పత్తికి కొంత మేపు అవసరము ఉంటుంది. గేదెలకు ప్రతీ 2.00 లీటర్ల పాల ఉత్పత్తికి 1.00 కిలో దాణా మేపాలి. సంకర జాతి ఆవులకు ప్రతీ 2.5 లీటర్ల పాల ఉత్పత్తికి 1.00 కిలో దాణా మేపాలి. పశువు చూడిదైనచో చూడి కాలాన్ని బట్టి పైన చెప్పిన వాటితో పాటు అదనంగా కొంత దానా మేపాలి. ఎక్కువ ఆదాయం తీయటానికి పాల దిగుబడిని బట్టి అధికంగా మేపుట చాల అవసరం. పాలలో వెన్న శాతాన్ని బట్టి కూడా దానాల నాశకం పెంచాలి.

ఆహారాన్ని అందించే పద్ధతులలో ఒక కొత్త పద్ధతి బైపాస్ ప్రొటీన్స్‌ను మేపటం. బైపాస్ ప్రొటీన్స్ మేపటంవలన పాల ఉత్పత్తి ఖర్చు 25% తగ్గించవచ్చును. ప్రత్తి గింజల చెక్కను బైపాస్ ప్రొటీన్స్ గా రోజుకు 15 లీటర్లు, ఆపైన పాలిచ్చే పశువులకు మేపవచ్చును. కనీసం రోజుకు 1.00 కేజి ప్రత్తి గింజల చెక్కను ( ఉదయం 0.5 కేజి, సాయంకాలం 0.5 కేజి) కొద్ది సేపు నీళ్లలో నాన బెట్టి ఇస్తే మంచి ఫలితాలను పొందవచ్చును.



## 3. నీరు

పాడి పశువుల పోషణలో మేపు ఎంత అవసరమో నీరు కూడా అంతే అవసరం. ఒక లీటరు పాల ఉత్పత్తికి 4 లీటర్ల నీరు అవసరం వుంటుంది. కుడితి నీళ్ళు పెట్టడం ద్వారా పశువు ఎక్కువగా నీళ్ళు తాగేటట్లు చేయాలి. ఈ కుడితిలో చిట్టు, తవుడు, దానాలు, కలుపవచ్చును.

పశువులకు నీరు రోజుకు రెండుసార్లు పెట్టాలి. వీలుపడినచో ఇంకనూ ఎక్కువ సార్లు పెట్టుట మంచిది. నీరు ఎక్కువ సార్లు పెట్టినచో పశువు ఎక్కువ నీరు త్రాగుతుంది. ఎక్కువ నీరు త్రాగుట వలన పాల దిగుబడి కూడా పెరుగుతుంది.

ఆవు కన్నా గేదెకు ఎక్కువ నీరు కావాలి. రోజుకు 5 లీటర్ల పాలు ఇచ్చే ఆవు 30-40 లీటర్ల నీరు త్రాగుతుంది. అంతే నీరు కడుగుటకు, పశువుల శాలలు శుభ్రపరుచుటకు అవసరం. పెద్ద పశువులకు కావలసిన నీటిలో సగం దూడలకు కావలసి ఉంటుంది.

పశువుకు కావలసిన నీరు వాటి శరీర బరువు పైన, భౌతిక పరిస్థితి పైనా పాల దిగుబడి పైనా వాతావరణం పైనా ఆధారపడి వుంటుంది.

## 4. వసతి సౌకర్యం

పశువుల శాలలు ఎత్తైన ప్రదేశంలో నిర్మించాలి. విపరీత వాతావరణంలో పశువులను చలిగాలి, వర్షం, ఎండ, వేడి నుండి రక్షించే విధంగా నిర్మించాలి. పశువుల శాలలోనికి సూర్య కిరణాలు నేరుగా పడకుండా వుండటానికి, పశువులశాల పొడవు తూర్పు, పడమరల దిశలో నిర్మించాలి. పశువులకు నీడ కోసం పశుశాలలూ, స్వేచ్ఛగా తిరగటానికి ఖాళీ స్థలం వున్న వసతి మిక్కిలి అనుకూలంగా వుంటుంది. పశుశాలలు చుట్టూ అవిశ, సుబాబుల్ వంటి చెట్లను పెంచితే త్వరగా ఎదిగి వడగాలులను, ఈదురు గాలులను, నిరోధిస్తాయి. పశుగ్రాసంతో పాటు నీడకూడా లభిస్తుంది.

పశుశాలల పై ఖర్చు ఎక్కువ పెట్టకుండా చౌకగా నిర్మించుకోవటం మంచిది. పశువుల శాల ఎత్తు 12 నుండి 16 అడుగులు ఉంటే మంచిది. పశువుల శాలలు చల్లగా వుండటం కోసం, మంకీ రూఫ్‌తో తయారు చేయుట మంచిది.

ప్రతి పశువుకూ 6 అడుగుల పొడవూ, 5 అడుగుల వెడల్పూ గల స్థలం పశువుల శాలలో ఏర్పాటు చేయాలి. పశువుల శాలలకు ముందు, పశువుల శాల కంటే మూడు రెట్లు ఖాళీ స్థలం

ఉండటం మంచిది. నేల ఏటవాలుగా నీరు త్వరగా మురుగు కాలువలోనికి పోయేటట్లు ఏర్పాటు చేయాలి. ఖాళీ స్థలంలో కంకర వేసి దిమ్మిసా చేసి గట్టి పరచటం చాల అవసరం.

మేత గాడి అన్ని పశువులకు కలిపి పొడవుగా, ముందు ఎత్తు 1.5 అడుగులుతోను, వెనుక ఎత్తు 3 అడుగులతోను, వెడల్పు 2.5 అడుగులు, లోతు 15 అంగుళాలలతోను నిర్మించుకోవాలి. మేత గాడి వద్ద పశువులను కట్టటానికి రింగులు ఏర్పాటు చేసుకోవాలి. పశువుల వెనుక భాగంలో మూత్రం పోవటానికి, పశువులను కడిగిన నీరు పోవటానికి మురుగు కాల్వలు 1 అడుగు వెడల్పు 3 అంగుళాల లోతు తో ఏర్పాటు చేయాలి. మూత్రం, నీరు ఒక గోతిలోనికి నేరుగా వెళ్ళేలా గొయ్యి నిర్మించాలి.

పశువుల శాలలో పశువులను కట్టకుండా వదిలిపెట్టాలి. దీనివలన శరీరానికి కావలసిన వ్యాయామం అందుట వలన పశువు ఆరోగ్యంగా వుండటమే గాక ఎద లక్షణాలను తేలికగా గుర్తించవచ్చును.

మూడు మాసాల లోపు దూడలకు 15 చదరపు అడుగులు, మూడు మాసాలు పైబడిన దూడలకు 18 చదరపు అడుగులు వసతి కావలయును. ఒక నెల వయస్సు వచ్చేవరకూ 3-4 దూడలను ఒకే కానాలో ఉంచి, కలిసి పెరిగే అలవాటు చేయడం మంచిది.

## 5. యాజమాన్యం

పశుపోషణ ద్వారా లాభాలు ఆర్జించటానికి ఆధునిక శాస్త్రీయ యాజమాన్య పద్ధతులను ఆచరించాలి. పాడి పరిశ్రమ ద్వారా లభించే ఆదాయం పాల ఉత్పత్తి ఖర్చుమీద, పాల అమ్మకం ధర మీదే గాక, ఉప ఉత్పత్తులపైన కూడ ఆధారపడి వుంటుంది.

పాల పరిశ్రమ ఒక ఫ్యాక్టరీ అనుకుంటే, పాడి పశువు ఒక యంత్రం, పచ్చగడ్డి, ఎండు గడ్డి, దానాలు ముడి పదార్థాలు. ఉత్పత్తి అయ్యే పదార్థాలు - పాలు, పేడ, దూడలు. ఉప ఉత్పత్తులు బయోగ్యాస్, విద్యుత్, క్రిమిసంహారక మందులు, సేంద్రియ ఎరువులు.

నిత్యం పశుశాలల్లో జరుగు కార్యక్రమాలైన 1. పశువులు, పశువుల శాలలు, పశువుల దొడ్ల పరిశుభ్రత 2. దానాల వాడకం 3. పచ్చగడ్డి వాడకం 4. పాల దిగుబడి 5. పశువుల ఆరోగ్యం - వైద్యం 6. చూడి కట్టించుట 7. చూడి పరీక్షలు 8. రికార్డుల పరిశీలన 9. ఆదాయం - ఖర్చులు



మొదలగు విషయాలను పశువుల యజమాని స్వయంగా పర్యవేక్షించగలిగినచో ఆదాయాన్ని పెంచుకోవచ్చును.

<u>పాల ఉత్పత్తి దారునికి కావలసిన లక్షణాలు:</u> 1. పాలు తీయగలగాలి 2. ఎద లక్షణాలను గుర్తించగలగాలి, ఎదకు తెచ్చుటకు తీసుకొనవలసిన జాగ్రత్తలు తెలుసుకోవాలి. 3. పశువులకు ఇచ్చే ఆహారం, వాటి ఖరీదు, ఇవ్వవలసిన మోతాదులు నిర్ణయించగలగాలి. 4. ప్రథమ చికిత్సా విధానం తెలియాలి 5. చూడి పశువులను పెంచుటకు తీసుకొనవలసిన జాగ్రత్తలు తెలుసుకోవాలి 6. పశువు ఈనే సమయంలోనూ, ఈనిన తర్వాత తీసుకొనవలసిన జాగ్రత్తలు గురించి తెలుసుకోవాలి 7. దూడల పెంపకం గురించి తెలుసుకోవాలి. 8. ఆరోగ్యంగా ఉన్న పశువుల లక్షణాలను, అనారోగ్యంగా ఉన్న పశువుల లక్షణాలను గుర్తించగలగాలి. 9. పశువును ప్రేమించగలగాలి 10. పాల రంగు, రుచిలను బట్టి నాణ్యత నిర్ణయించగలగాలి. 11. పశువుల శాలల్లో నిత్యం చేయవలసిన పనులు అప్పుడప్పుడు చేయవలసిన పనులను నిర్ణయించగలగాలి 12. పశుపోషణకు సంబంధించిన రికార్డులైన ఎ) స్టాక్ రిజిష్టర్ బి) పాల దిగుబడి సి) దూడలు పుట్టినప్పటి బరువు డి) వంశ చరిత్ర ఇ) దాణాల వాడకం ఎఫ్) ఆరోగ్యం, పునరుత్పత్తి, పనిమనుషుల రిజిష్టర్‌లను నిర్వహించటం ద్వారా పశువుల ఉత్పాదక శక్తి, మేత వినియోగం, వ్యాధుల వివరాలు, పునరుత్పత్తి మొదలగు విషయాలను అంచనా వేయగలగాలి.

ప్రతీ రోజు పశువుల్ని కనీసం 2 సార్లు ముందు, వెనుక పరిశీలించాలి. ఆరోగ్యంగా వున్న పశువు నిముషానికి 35-45 సార్లు నెమరు వేస్తుంది. అనారోగ్యంగా ఉన్న పశువులను గుర్తించి, వేరు చేసి, చికిత్స చేయించాలి. పశువు వెనుక భాగం జాగ్రత్తగా పరిశీలిస్తే మూగ ఎదలో ఉన్న పశువుల్ని గుర్తించడం వీలుఅవుతుంది.

వయస్సు ప్రకారం చూడి పశువులను , పాడి పశువులను , వట్టిలను, పెయ్యలను, దూడలను విడివిడిగా ఉంచాలి. శాస్త్రీయ పద్ధతిలో ఆహారాన్ని సమకూర్చి, పశువులలో దాగిఉన్న ఉత్పాదక శక్తిని పూర్తిగా వెలికితీయాలి. పాలు పితకటంలో మెలుకువలు పాటించాలి. పాలు పితకడంలో అనుభవము ఉన్న వ్యక్తుల చేత పాలు పితికించాలి. అవసరం అయినచో పాలు పితకటం లోని మెలుకువలను నేర్చుకోవాలి. పాలు పితకటానికి ముందే పశువు పేడ విసర్జించేలా చూడాలి. పాలు పితకటానికి గంట, రెండు గంటల ముందుగాని, తరువాత గాని దాణా ఇవ్వాలి.

మేలు జాతి దూడల కొరకు కృత్రిమ గర్భోత్పత్తి విధానాన్ని, ఎంబ్రియో ట్రాన్స్‌ఫర్ విధానాన్ని అవలంబించాలి. మేలు జాతి లక్షణాలున్న పెయ్యదూడలను వేరు చేసి ప్రత్యేకంగా పోషించాలి.

పశువు ఈనిన 45-60 రోజులలో ఎదకు రావాలి. ఆ విధంగా ఎదకు రాని ఎడల ఆహారంలో

తగిన మార్పులు చేసి, మందులు ఉపయోగించి ఎదకు తీసుకురావాలి.

మందలో ఎప్పుడు చూసినా ప్రతీ 5 పశువులలో 4 పాడిలో వుండాలి. వట్టిపోయిన ఒక పశువు 7 నెలల చూడి దాటి వుండాలి. పాలలో వున్న 4 పశువులలో 3 చూలుతో ఉండాలి.

మందలో వున్న మంచి పశువులను అధిక ధరకు ఆశపడి అమ్ముకోరాదు. మందలో వుండరాని పశువులను తక్కువ ధరకైనా వీలైనంత త్వరలో అమ్ముకోవాలి.

చక్కటి యాజమాన్యం, మంచి పోషణలతో అధిక పాల దిగుబడి సాధించవచ్చును. మనుష్యులు త్రాగటానికి ఉపయోగించే నీటిని పశువులకు ఇచ్చినచో పాల దిగుబడి పెరుగుతుంది. టి.డి.ఎస్ ఎక్కువగా వున్న నీటిని వాడినచో పాల ఉత్పత్తి తగ్గుతుంది. రోజు 100 మి.లీ కాల్షియం దానాలో కలిపి ఇచ్చినచో పశువు నుండి పాల దిగుబడి పూర్తి స్థాయికి సాధించవచ్చును.

పశువుల దానాతో పాటు 1% మినరల్ మిక్చర్ వాడి పాల దిగుబడి పెంచవచ్చును.

జీర్ణశక్తి పెంచటానికి హిమలయా బత్తీసా వంటి డైజెస్టర్ మందులను వారానికి ఒక్కసారి బెల్లంతో కలిపి మేపటం మంచిది. పాముల మందులు ప్రతీ 3 నెలలకూ ఒకసారి వేయటం, రక్తపరీక్షలు, పేడ పరీక్షలు చేసి వ్యాధినిరోధక చర్యలు తీసుకోవటం ద్వారా పాల దిగుబడి పెంచవచ్చును.

పొదుగు వాపు గుర్తించటానికి ప్రతీ రోజు నల్ల గుడ్డపైన నాలుగు రొమ్ముల నుండీ పాలు పితికి తొరకలు గుర్తించి, అవసరం అయినచో హైతోమేక్స్ మాత్రలను ఉదయం -6, సాయంత్రం -6 చొప్పున మూడు రోజులు వాడి పాల దిగుబడి తగ్గకుండా చూసుకొనవచ్చును.

1.00 కే.జీ. నూకల జావకు 100 గ్రాముల యూరియా కలిపి మేపవచ్చును. రోజుకు 20 లీటర్ల కన్నా తక్కువ పాలు ఇచ్చే పశువులకు దానాలో 2% యూరియా కలిపి మేపినచో పాల ఉత్పత్తి పెరుగుతుంది.

రోజుకు 20 లీటర్ల కన్నా ఎక్కువ పాలు ఇచ్చే పశువులకు ఎట్టి పరిస్థితులలోను యూరియా వాడరాదు.



తగిన మోతాదులో ఫిష్ ఎమినో ఏసిడ్ వాడి పాల ఉత్పత్తిని పెంచవచ్చును.

ఒక మనిషి 10 పాడి పశువులను లేక 40 దూడలను చూడవలసి వుంటుంది.

ప్రతి పశువుకు 10 సెంట్ల భూమి ఉండేటట్లుగా పచ్చిమేతను పెంచాలి.

పాల ఉత్పత్తి మే, జూన్, జూలై, అగస్టు మాసాలలో తక్కువగాను సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ మాసాలలో ఎక్కువగాను జనవరి, ఫిబ్రవరి, మార్చి మాసాలలో సామాన్యంగాను జరుగుతుంది.

పాల ఉత్పత్తి ఖర్చులను తగ్గించుకొని ఎక్కువ ఆధాయం సంపాదించుకొనే అవకాశం రైతు చేతిలో ఉంది.

పోషక విలువలు తగ్గకుండా మేపు ఖర్చులు తగ్గించుకోవాలి. స్వయంగా పశుపోషణ నిర్వహించాలి.

పాడి కాలంలో 1800 లీటర్ల కన్నా తక్కువ పాలిచ్చే గేదెల వలన ఖర్చులు ఎక్కువ లాభం తక్కువ. పాడి కాలంలో 3500 లీటర్ల కన్నా తక్కువ పాలిచ్చే ఆవులను మేపటం లాభదాయకం కాదు. నిర్వహణ రికార్డులు వ్రాసుకుంటే, ముందే లోటుపాట్లు గుర్తించి ఖర్చులు తగ్గించుకోవచ్చును. పాడి పరిశ్రమ ఉత్పత్తి వ్యయం పైనా, మార్కెట్‌లో గిట్టుబాటు ధర పైనా, ఆధారపడుతుంది. నీతి, నియమాలకు కట్టుబడి ప్రేమతో పశుపోషణ చేస్తూ, అధిక పాల ఉత్పత్తికి కావలసిన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొంటూ, ఉప ఉత్పత్తులైన బయోగ్యాస్, విద్యుత్, సేంద్రియ ఎరువులను ఉపయోగించుకొనగలిగినప్పుడు, పాడి పరిశ్రమ అత్యంత లాభదాయకంగా ఉంటుంది.

## 6. ఆరోగ్యం

పశువుల ఆరోగ్యం విషయంలో అశ్రద్ధ చేస్తే పాల ఉత్పత్తి తగ్గి రైతు ఆర్థికంగా నష్టపోతాడు. పశువు ఆరోగ్యంగా ఉంటేనే పాలు బాగ ఇస్తుంది. పశుపోషకుడు పశువుల్ని ప్రతీరోజు ఉదయం, సాయంత్రం పశువు వెనుక భాగాన్ని, ముందు భాగాన్ని జాగ్రత్తగా పరిశీలించినచో, పశువుల ఆరోగ్య సమస్యలను, ఎద లక్షణాలను తెలుసుకొని తగిన వ్యాధి నిరోధక చర్యలు తీసుకొనవచ్చును.

ఎక్కువగా పాలిచ్చే సామర్థ్యం ఉన్న ఆవులకు 15రోజులలో ఈనుతుందనగా 4 రోజుల వ్యవధిలో ఒక కాల్షియం బాటిల్ ఇవ్వాలి.

ప్రతీ రైతూ ఆరోగ్యంగా వున్న పశువు లక్షణాలనూ, అనారోగ్యంగా వున్న పశువుల లక్షణాలనూ, క్షుణంగా తెలుసుకోవాలి. జబ్బుపడిన పశువుల శరీర ఉష్ణోగ్రత, నాడి, శ్వాసలను పరీక్ష చేసి, పశువు ఆరోగ్యాన్ని అంచనా వేయగలగాలి.

ప్రతీ రోజు పశువుల శాలలు శుభ్రపరచాలి. గడ్డి కత్తిరించే ప్రదేశాలలోనూ, దానాలు తయారు

చేసే ప్రదేశంలోను, దానా దినుసులు ఆడించే ప్రదేశాలు, సరిగా శుభ్రపరచనప్పుడు అచ్చులు కట్టి, పంది కొక్కులు, ఎలుకలు, బొద్దింకలు ఎక్కువగా సంచరించి, దానాలను పాడు చేసి, పశువులకు అనారోగ్యాన్ని చేకూర్చతాయి. కనుక తగిన జాగ్రత్తలు తీసుకొనవలసి ఉంటుంది. పశువుల శాలల్లో సున్నపు పొడిని నెలకు రెండు సార్లు చల్లించాలి. గోడలను, నీటి తొట్టిలను నెలకు ఒక సారి సున్నం వేయించాలి.

పశువులకు వచ్చు వ్యాధులను 1. సామాన్య వ్యాధులు 2. అంటు వ్యాధులుగా విభజించవచ్చును.
**1. సామాన్య వ్యాధులు** - గాయాలు, బెణుకులు, వాపులు, సెగగడ్డలు, ఎముకలు విరగటం, పశువు చన్నుల మీద పుండ్లు, పురుగుల పట్టిన పుండ్లు, ఈనుకుపోవటం, పాల జ్వరం, పొదుగు వాపు, ఎలర్జిక్ పొదుగు వాపు మొదలగునవి. సామాన్య వ్యాధులను బోరిక్ పౌడరు, జింక్ ఆక్సైడ్, సల్ఫానిలమైడ్ పౌడరు, టించర్ అయోడిన్, దూది, బ్యాండేజి, టర్పంటైన్, అయోడిన్ మలాము, బోరిక్ ఆయింట్‌మెంట్, వేప నూనె మొదలగు వాటి సహాయంతోనూ, కాల్షియం ఇంజక్షన్లు, పెన్సిలిన్, టెర్రామైసిన్, స్ట్రెప్టోమైసిన్ మొదలగు యాంటిబయోటిక్స్ వాడి తగ్గించవచ్చును.

**2. అంటువ్యాధులు** - గాలి కుంటు వ్యాధి (గాళ్ళు), చిడపారుడు వ్యాధి(పెద్ద రోగము) గొంతువాపు(గురక), జబ్బవాపు, దొమ్మరోగం, జలగ వ్యాధి, థైలేరియాసిస్ వంటి అంటువ్యాధులు రావటానికి సూక్ష్మజీవులే కారణం. టీకాలు క్రమ పద్ధతిలో వేయించి అంటువ్యాధులు రాకుండా కాపాడవచ్చును. నివారణ చర్యలు పాటించి ఏలిక పాములు, బద్దెపురుగులు, పిడుదులు, గోమార్లు, ఈగలు, దోమలను అరికట్టవచ్చును. బిహెచ్‌సి పొడి, మలాథియాన్, మైలతుత్తం, ద్రావణాలను పశువుల శాలల్లో నిత్యం చల్లి వీటిని అరికట్టవచ్చును.

## 7. పారిశుద్ధ్యం

పశువుల శాలల పారిశుద్ధ్యం మీదే పొదుగు ఆరోగ్యం ఆధారపడి ఉంటుంది. షెడ్ శుభ్రంగా లేకపోతే పొదుగు మీద బురద, దుమ్ము, పేడ మట్టి అంటుతాయి. పేడను, చెత్తను ఎప్పటికప్పుడు తీసివేయాలి. ఉదయం, సాయంత్రం షెడ్స్ కడగాలి. షెడ్లో గుంటలు, పగుళ్ళు ఉండరాదు. పెంటకుప్పలు షెడ్డుకు దూరంగా ఉండాలి. గాలి వీచే దిశలో ఉండకూడదు. పరిసరాలలో మురుగు నీరు లేకుండా చేయాలి. పాకలలో బూజులు ఎప్పటికప్పుడు దులిపి వేయాలి. పశువులశాలల్లో ఎలుకలు, బొద్దింకలూ, క్రిమి కీటకాలు లేకుండా ఫినాయిల్, డెట్టాల్, సోడాకార్బోనేట్, 4% బ్లీచింగ్ పౌడర్ వంటి క్రిమిసంహారక మందులతో ప్రతిరోజు శుభ్రం చేయాలి. షెడ్లలో గాలి, వెలుతురు ధారాళంగా ప్రసరించాలి. నేల మీద ఎండు గడ్డిపరిచి పొడిగా పక్క ఏర్పాటు చేయాలి. పశువుల శాలలోనికి



ఇతరులను అనుమతించరాదు. వారి ద్వారా కొన్ని వ్యాధులు ఇతర ప్రాంతాలనుండి షెడ్డులోని పశువులకు వ్యాపించే ప్రమాదం ఉంది.

సూక్ష్మజీవుల వలన అంటువ్యాధులు, గాలి ద్వారా, నీటి ద్వారా మలమూత్రముల ద్వారా ఒక పశువు నుండి వేరొక పశువుకు సోకును. పశువులు త్రాగేందుకు ఏర్పాటు చేసిన తొట్టిలలోపల వైపు సున్నం వేసి నాచు పట్టకుండా చేయాలి. నెలకు ఒకసారి గోడలకు వెల్లవేయించాలి. పేడకాలువలలోను, పశువులశాలలోను నెలకు 2 సార్లు సున్నం చల్లితే, క్రిములు నశించి, పొదుగువాపు వంటి సమస్యలు ఉత్పన్నం కావు. మైలతుత్తం ద్రావణాన్ని షెడ్డులలో చల్లినచో పశువుల డెక్కలు మెత్తబడకుండా కాపాడవచ్చును.

పశువులను కడుగుట, దానా తొట్టిలు శుభ్రపరుచుట, పశువులశాలలను శుభ్రపరుచుట, కడుగుట, నిత్యం క్రమం తప్పకుండా చేయాలి. జబ్బుపడిన పశువులను వేరుచేయాలి. పాలకేన్స్, బకెట్స్, ఇతర పాత్రలు రోజు ఉదయం, సాయంత్రం శుభ్రపరచాలి.

టీకాలు క్రమపద్ధతిలో వేయించి అంటువ్యాధులు రాకుండా కాపాడాలి. వ్యాధులు వ్యాపింపచేసే పేలు, గోమార్లు, పిడుదులు మొదలగు బాహ్యపరాన్న జీవులను నిర్మూలించుటకు మలాథియాన్, బ్యూటాక్స్, డి.డి.టి, ఫెరిత్రిన్ మొదలైన క్రిమిసంహారక మందులను పిచికారి చేయాలి. అప్పుడప్పుడు మొత్తం శరీరానికి పశువు, వేపనూనె వంటివి రాసి వీటిని నివారించవచ్చును.

షెడ్డులలో దోమలను, ఈగలను తగ్గించుటకు వేప ఆకుల పొగ వేయాలి. శీతాఫలం ఆకు కషాయం షెడ్డులలో జల్లాలి. అప్పుడప్పుడూ పొదుగుమీద, తోకమీద, డొక్కలకు పొదుగుకు మధ్యన బాగా పెరిగిన జుత్తును కత్తిరిస్తూ ఉండాలి. పశువులకు అప్పుడప్పుడూ డెక్కలు, కొమ్ములూ కత్తిరించాలి. జుట్టు కత్తిరించినప్పుడు దువ్వాలి. పాలుతీసే ముందు, తరువాత పశువు వెనుక కాళ్లను, పొదుగు పరిసరాలను శుభ్రంగా కడగాలి. పొదుగును, చన్నులను ప్రతిసారి పాలు తీసేముందు తరువాత పొటాషియం పెర్మాంగనేటు లోషన్‌తోగాని లేక సావలాన్ లోషన్‌తో గాని కడగాలి. పొదుగు మలినమవకుండా పాడి పశువుకు సరిఅయిన పక్కను అమర్చాలి.

దూడలకు బాగా పులిసిన మజ్జిగను గోరువెచ్చని నీటిలో కలిపి స్నానం చేయించి బాహ్యపరాన్న జీవులైన పేలు, గోమార్లు, పిడుదులు, ఈగలు, దోమలు నివారించవచ్చును. లేగదూడల వెంట్రుకల్ని శీతాకాలంలో కత్తిరించకూడదు. దూడలకు కొమ్ములు రాకుండా మందులు రాయుటం గాని, బూడిపెలు కాల్చుటగాని చేయాలి. వేసవిలో దూడల వెంట్రుకలు కత్తిరించాలి. గ్రూమింగ్ చేయాలి.

వేసవి కాలంలో పశువులు వడదెబ్బకు గురి కాకుండా చూడాలి. వేసవిలో వ్యాధినిరోధక శక్తి

తగ్గి, గొంతువాపు, జబ్బవాపు వంటి వ్యాధులు సోకే ప్రమాదం ఉన్నందున ముందే టీకాలు వేయించాలి. వేసవిలో పశువులను పచ్చని చెట్ల క్రింద నీడలో ఆరుబయట కట్టివేయగలిగినచో మంచి ఫలితాలను సాధించవచ్చును. ఎక్కువ వేడిగా ఉండే మండు వేసవిలో చూడి పశువులను తిరగనీయకూడదు. శీతల పరిస్థితులు కల్పించి శరీర ఉష్ణోగ్రత పెరగకుండా చూడాలి.

నీరు, మేత కలుషితం కాకుండా చూడాలి. తడిసిన, కుళ్ళిన గడ్డిని పశువులకు మేపకూడదు. ఫంగస్ వల్ల చెడిపోయిన, బూజు పట్టిన దాణా మిశ్రమములను పశువులకు మేపరాదు. దాణా, గడ్డి, ఇతర పశుగ్రాసాలు తడిసి, బూజు చేరకుండా జాగ్రత్తగా భద్రపరచాలి. నీటితొట్టిలలో అయోడోఫర్, మెడిక్లోర్ వంటి మందుల్ని కలపాలి.

## 8. అనువైన ప్రదేశము

పశువుల శాలలు నిర్మించే ప్రదేశంలోని వాతావరణం పశుపోషణకు అనుకూలంగా వుండాలి. చక్కటి నీటి వసతి కలిగి ఉండాలి. ముడి సరుకులైన దాణాలు, పచ్చగడ్డి, ఎండుగడ్డి వగైరాలు తెచ్చుకొనుటకు, పాలను ఇతర ప్రదేశాలకు తీసుకొని వెళ్ళి అమ్ముకొనుటకు చక్కని రవాణా సౌకర్యాలు అందుబాటులో వున్న ప్రదేశమై ఉండాలి. పశుపోషణకు కావలసిన మానవ శక్తి, ఇతర ముడి పదార్థాలు, వనరులు, పశువుల శాలలకు అందుబాటులో వుండాలి. కరెంటు దగ్గరలో వుండాలి. తప్పనిసరిగా మనం నిర్మించే పశువుల శాలలకు పశువైద్య సౌకర్యాలు అందుబాటులో వుండాలి.

## 9. మార్కెట్ సౌకర్యం

పండించిన పాలను తగిన గిట్టుబాటు ధరకు అమ్ముకొవాటానికి మార్కెట్ సౌకర్యం చూసుకొవాలి. హోటళ్ళు, మిఠాయి బండారాలకు, హాస్టళ్ళకు రైతు నేరుగా పాలు అమ్మగలిగినచో అధిక ఆదాయం పొందవచ్చును. తయారు చేసిన పాల పదార్థాలను, పాలను అమ్ముటకు అయ్యే ఖర్చులు తక్కువలో అవ్వాలి.

హోటళ్ళు, హాస్టల్స్, హాస్పటల్స్, స్వీటు షాపులు, పాల సేకరణ కేంద్రాలు, ఇతర వినియోగదారులు మొదలగు వివరాలు ముందే తెలుసుకొని, ఉత్పత్తి చేయబోయే పాలు, పాల పదార్థాల మార్కెట్ అంచనా అధారంగా పాడి పరిశ్రమను ప్రారంభించాలి.



చుట్టు పక్కల ప్రదేశాలలో పాల పదార్థాలైన నెయ్యి, పెరుగు, కోవా, పన్నీరు వగైరాలకు గిరాకీ వున్నచో, వాటిని తయారు చేసి అమ్మగలిగినచో అధిక ఆదాయం పొందవచ్చును.

తయారుచేసిన పాల పదార్థాలను, పాలను అమ్ముటకు అయ్యే రవాణా ఖర్చులు తక్కువ అవ్వాలి.

## 10. పెట్టుబడి

50 పశువులతో ప్రారంభించుదామన్న పాడి పరిశ్రమలో 35-40 పాలిచ్చేవి, 10-15 చూడివి, 20-25 చూడి పడ్డలు, 35-40 దూడలు వివిధ వయస్సులలో, ఒక ఆబోతు, ఒక దున్నపోతు ఉండాలి. గేదెలను, ఆవులను 60-40 నిష్పత్తిలో కొనుగోలు చేసి పాడి పరిశ్రమ ప్రారంభించటం మంచిది.

పశువులను కొనుటకు, పశువుల శాలలు నిర్మించుటకు, కావలసిన యంత్ర పరికరములు కొనుటకు, మేతలు, దాణాలు అమర్చుకొనుటకు, కావలసిన పెట్టుబడులను సమకూర్చుకొని మాత్రమే పాడి పరిశ్రమను ప్రారంభించాలి. అధికంగా అప్పులు చేసి, పాడి పరిశ్రమను ప్రారంభించటం మంచిది కాదు.